క్లుప్తంగా

చిరు ధాన్యాలతో ఆరోగ్యం



కారెంపూడి: చిరు ధాన్యాలతో చక్కని ఆరోగ్యాన్ని సొంత చేసుకోవచ్చని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వై.ఉమాదేవి పేర్కొన్నారు. గాదె వారిపల్లె గ్రామంలో శనివారం పోషకాహార మాసోత్సవాన్ని నిర్వహించారు. సజ్జలు, జొన్నలతో పాటు వివిధ రకాల చిరు ధాన్యాలతో చేసిన వంటలను ప్రదర్శించారు. అటుకులు, బెల్లం, ఆకుకూరలు, పండ్లు, డ్రై ఫ్రూట్స్, గుడ్లు, పాలు రక్త హీనతను దూరం చేస్తాయని గర్భిణులకు, బాలింతలకు వివరించారు.

ముగిసిన మరమ్మతు పనులు

మాచర్ల: దుర్గి, వెల్దుర్తి, మాచర్ల పట్టణంలో 131/33 కేవీ సబ్ స్టేషన్‌ల పరిధిలో మరమ్మతుల పనులు శనివారం పూర్తి చేశారు. ఏఈ జె.హరిబాబు, డీఈ ఎ.రామయ్య ఉదయం నుంచి విద్యుత్ సరఫరా నిలిపివేసి, పనులు పూర్తి చేశారు.

ఉచిత వైద్య శిబిరం, సేవా కార్యక్రమాలు



మాచర్ల : స్థానిక కేసీపీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఇందిరా దత్తు జన్మదినం సందర్భంగా రమేష్ హాస్పిటల్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కేసీపీ జనరల్ మేనేజర్ వి.వెంకటరమణ ప్రారంభించారు. ఫ్యాక్టరీ, మెయిన్స్ విభాగంలో మొక్కలు నాటారు. ఫౌండర్, చైర్మన్ వెలగపూడి రామకృష్ణ, లక్ష్మణదత్తు విగ్రహాలకు పుష్పాంజలి ఘటించారు. ఆర్‌కేసీ కాలనీలో 500ల మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. చెన్నకేశవ స్వామి ఆలయంలో అన్నదానం చేశారు. ప్రభుత్వాసుపత్రిలో ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ఓర్సు శివయ్య, గోళ్ళ లక్ష్మయ్య, కె.శ్రీనివాస రెడ్డి, కాశయ్య రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. సీనియర్ డీజీఎం, ఏజీఎంలు సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.

పట్టణంలో క్రికెటర్ అజయ్‌కుమార్‌రెడ్డి

మాచర్ల: పట్టణంలో పుట్టి, భారతదేశ అంధుల క్రికెట్ (బ్లైండ్) టీమ్‌కు కెప్టెన్‌గా వ్యవహరించడమే కాకుండా పలుమార్లు ప్రపంచ విజేతగా నిలిపిన మాజీ కెప్టెన్ క్రికెట్ ఇల్లూరి అజయ్‌కుమార్‌రెడ్డి అర్జున అవార్డుకు ఎంపిక కావడం ఎంతో గర్వకారణమని వీఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు వేముల శ్రీనివాసరావు అన్నారు. మాచర్ల పట్టణానికి శనివారం వచ్చిన ఇల్లూరి అజయ్‌కుమార్‌రెడ్డి తన బంధువులను కలుసుకున్నారు. మిత్రుడు శ్రీనివాసరావు సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వీఎస్ఆర్ ఫౌండేషన్‌కు తన వంతు సహాయ సహకారాలందిస్తానన్నారు.

నేడు గాంధీ కాంస్య విగ్రహావిష్కరణ



గురజాల : స్థానిక నగర పంచాయతీ పరిధిలోని గాంధీ బొమ్మ సెంటర్ నందు ఆదివారం మహాత్మా గాంధీ కాంస్య విగ్రహావిష్కరణ చేయనున్నట్లు మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు అత్తులూరి సుబ్బారావులు పాల్గొంటారన్నారు. 1980 అక్టోబర్ 2వ తేదీన గాంధీ బొమ్మ అరుగును ప్రారంభించారని, అరుగు పూర్తిగా దెబ్బతినడంతో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గ్రానైట్ రాయితో అరుగును, కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు వేలాదిగా పాల్గొని విజయవంతం చేయాలని నాయకులు కోరారు.

బ్రిడ్జికి అడ్డంగా లారీ



రాజుపాలెం: మండలంలోని మాచర్ల–గుంటూరు రహదారిపై అనుపాలెం పెద్ద కాలువ బ్రిడ్జిపై శనివారం లారీ ఇరుక్కుపోయింది. పిడుగురాళ్ల నుంచి గుంటూరు వెళుతున్న లారీ కారణంగా ఇరువైపులా వందల సంఖ్యలో వాహనాలు ఆగిపోయాయి. పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకుని అతికష్టం మీద లారీని తప్పించి ట్రాఫిక్ క్లియర్ చేశారు. బ్రిడ్జిపై ఇరువైపులా భద్రత గోడలు పడిపోవడంతో తాత్కాలికంగా కర్రలు కట్టారు.

లోక్ అదాలత్‌లో కేసుల సత్వర పరిష్కారం



లోక్ అదాలత్‌నుద్దేశించి మాట్లాడుతున్న న్యాయమూర్తి

గురజాల: లోక్ అదాలత్ ద్వారా పెండింగ్‌లో ఉన్న కేసులకు సత్వర పరిష్కారం లభిస్తుందని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, నాలుగొవ అదనపు జిల్లా జడ్జి ఆర్ శరత్‌బాబు అన్నారు. స్థానిక కోర్టు భవనాల నందు శనివారం మెగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ అదాలత్‌లో 75 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. లోక్ అదాలత్‌లో మూడు బెంచీలకు గాను 21 సివిల్ కేసులు, 36 క్రిమినల్, 10 చెక్ బౌన్స్, 4 కుటుంబ వివాదాలు, 4 పెట్టీ కేసులు పరిష్కరించడం జరిగిందన్నారు. ఈ కేసులకు మొత్తం రూ.1,34,56,838లు కక్షిదారులకు అందించడం జరిగిందన్నారు. అనంతరం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్‌సివిల్ జడ్జి వై.శ్రీనివాసరావు, జూనియర్ సివిల్ జడ్జి కేవీ సత్యనారాయణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరెడ్డి, న్యాయవాదులు కర్రా చినకోటేశ్వరరావు, శ్రీనివాసరావు, జక్కా చెన్నకేశవరావు, సుందర జ్ఞానమ్మ తదితరులున్నారు.

80 కేసుల పరిష్కారం

మాచర్ల: కక్షిదారుల కేసులు వెంటనే పరిష్కరించి, వారికి ప్రయోజనం కల్పించేందుకు జాతీయ లోక్ అదాలత్, మహా లోక్ అదాలత్ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతోందని నర్సరావుపేట ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ఆశీర్వాదం పాల్ పేర్కొన్నారు. శనివారం మాచర్ల సివిల్ జడ్జి కోర్టులో ఆమె అధ్యక్షతన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ రాజీ పడదగ్గ ప్రతి కేసును పరిష్కరించుకోవడం ద్వారా కక్షిదారులకు ఇబ్బందులు తొలగుతాయన్నారు. ఈ సందర్భంగా సివిల్, క్రిమినల్, చెక్ బౌన్స్, భరణం తదితర 80కి పైగా కేసులను పరిష్కరించారు. ఏపీపీ రవీంద్ర, ఏజీపీ జీవీ, కమిటీ మెంబర్ ఎల్లాల రమేష్ యాదవ్, న్యాయవాదులు గట్ల సత్యనారాయణ రెడ్డి, కె.డేవిడ్ రాజు, గౌస్ పాషా, గాలీబ్ సాహెబ్, శ్రీనివాసరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జూపల్లి శ్రీనివాసరావు, శీలం వెంకటేశ్వర్లు, న్యాయవాదులు బాల జోజి, ఆర్.శ్రీనివాసరావు, మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, పోలీసు అధికారులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జడ్జి ఆశీర్వాదం పాల్

63 కేసులకు పరిష్కారం

పిడుగురాళ్ల: లోక్ ఆదాలత్ ద్వారా ఎన్నో కేసులను పరిష్కరించుకోవచ్చునని నేషనల్ లోక్ ఆదాలత్ బెంచ్ న్యాయమూర్తి ఎ. తౌషీద్ హుస్సేన్ అన్నారు. పట్టణంలోని సివిల్ జడ్జి కోర్టు నందు న్యాయ విజ్ఞాన సదస్సు, జాతీయ లోక్ ఆదాలత్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. అనంతర ఆయన పలు కేసులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ లోక్ ఆదాలత్‌లో మొత్తం 63 కేసులను పరిష్కరించి, రూ. 3,22,500 నగదును కక్షిదారులకు ఇప్పించటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో లోక్ ఆదాలత్ మెంబరు ఎస్. ప్రశాంత్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.కుమారస్వామి, సెక్రటరీ కె. వెంకటేశ్వర్లు, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్ ఉడతా కోటేశ్వరరావు, ఏజీపీ బత్తుల దాసు, న్యాయవాదులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలపై విద్యార్థులు దృష్టిపెట్టాలి

- సమస్యకు పరిష్కార దిశగా మేధస్సుని వాడాలి
- తిరుమల ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.వి.నారాయణ
- పలు కళాశాలల్లో ఇంజనీర్స్ డే వేడుకలు



తిరుమల కళాశాలలో పాల్గొన్న ప్రిన్సిపల్ డాక్టర్ వైవీ నారాయణ, అధ్యాపకులు

నరసరావుపేట రూరల్: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలు కొనుగోనే దిశగా ఇంజినీరింగ్ విద్యార్థులు తమ మేధస్సును ఉపయోగించాలని తిరుమల ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.వి.నారాయణ తెలిపారు. కళాశాలలో శనివారం ఇంజనీర్స్ డే వేడుకలను శనివారం నిర్వహించారు. కళాశాల ఆవరణలోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహం వద్ద పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వై.వి.నారాయణ మాట్లాడుతూ నూతన ఆవిష్కరణలపై విద్యార్థులు దృష్టిపెట్టాలని తెలిపారు. దేశానికి ఆదర్శంగా నిలిచిన ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎన్ఈసీలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న కార్యదర్శి రమేష్‌బాబు

ఎన్ఈసీ కళాశాలలో..

57వ ఇంజనీర్స్ డే వేడుకలను నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించారు. కళాశాలలోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరావు, కార్యదర్శి మిట్టపల్లి రమేష్‌బాబు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపల్ డా.సునీల్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ ఇంజనీర్‌గా దేశ ఖ్యాతిని నలుదిశలా చాటిన మహోన్నత వ్యక్తి విశ్వేశ్వరయ్య అని తెలిపారు. మనిషి మేధస్సుకు శాస్త్రీయత తోడైతే మహాద్భుతాలు సృష్టించవచ్చని ఆయన నిరూపించారని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లక్ష్మీ నరసింహునికి ఏకాదశి పూజలు



బెల్లంకొండ: మండలంలోని పులిచింతల ప్రాజెక్టు ముంపు గ్రామమైన కేతవరం శ్రీ రాజ్యలక్ష్మీ సమేత లక్ష్మీ నరసింహుని ఆలయంలో శనివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భాద్రపద మాస ఏకాదశి సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేశారు. రాజ్యలక్ష్మీ అమ్మవారికి పుష్ప తులసీ మాలలతో విశేష పూజా కార్యక్రమాలను, అభిషేకాలను ఆలయ అర్చకులు ప్రసన కుమార శర్మ నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

1.7 కేజీల గంజాయి స్వాధీనం



దాచేపల్లి : ఆర్టీసీ బస్సులో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని పొందుగల రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్ట్ వద్ద శుక్రవారం రాత్రి జరిగిన వాహనాల తనిఖీల్లో 1.07 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ జి.వెంకట్రావ్ శనివారం తెలిపారు. హైదరాబాద్ నుంచి నెల్లూరు వెళ్తున్న తెలంగాణ ఆర్టీసీ బస్సులో అద్దంకిలోని రెడ్డిపాలేనికి చెందిన షారుబ్ కుమార్ అనే యువకుడి బ్యాగ్‌లో గంజాయి ఉన్నట్లు చెప్పారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ వెల్లడించారు. హైదరాబాద్ పటాన్ చెరువులోని తన స్నేహితుడితో ఉన్న పరిచయాలతో తక్కువ ధరకు గంజాయి లభిస్తుండటంతో అక్కడ నుంచి తెస్తున్నట్లు నిందితుడు పోలీసుల విచారణలో అంగీకరించాడు. నిందితుడు బీఎస్సీ మూడవ సంవత్సరం చదువుతున్నాడు. ఈ తనిఖీలో ఎస్ఐ దాసరి శివనాగరాజు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

వెల్దుర్తి: మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలిక నాలుగు రోజుల కిందట అదృశ్యమైనట్లు తల్లిదండ్రులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నాలుగు రోజుల నుంచి స్టేషన్‌లో కేసు నమోదు చేయకపోవడంతో వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఎస్ఐ ఎం.సత్యనారాయణను వివరణ కోరగా బాలిక అదృశ్య ఘటనపై శనివారం కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

గోగులపాడులో గ్రామదేవతల జాతర ప్రారంభం

రొంపిచర్ల: మండలంలోని గోగులపాడు గ్రామంలో గ్రామ దేవతల జాతరోత్సవాలు శుక్రవారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. జ్యోతి, పావనాలకు శుక్రవారం రాత్రి గ్రామోత్సవాలు నిర్వహించారు. గ్రామ దేవతలు అయిన పోలేరమ్మ, అద్దంకమ్మ, పోతురాజులకు జాతరోత్సవాలు నిర్వహిస్తున్నారు. జాతర నిర్వహణవల్ల గ్రామంలోని అన్ని జీవరాశులకు ఆరోగ్యం, గ్రామంలో పంట పాలి పెరుగుతుందని గ్రామస్తుల నమ్మకం. జాతరలో భాగంగా శనివారం పోలేరమ్మ తల్లికి కుంకమ బండ్ల కార్యక్రమం నిర్వహించారు. జాతరలో గ్రామ దేవతలను ఆనందం కలిగించేందుకు గణాచార్యులు, పంబళ్ల, బైనీడీలు తమ తమ పురాతన వాయిద్యాలతో కథలు చెబుతూ సాంప్రదాయమైన వీరంగం ఆడారు. గ్రామస్తులు కూడా ఉత్సవాల్లో పాల్గొని నృత్యాలు చేస్తారు. ఆచారవంతులు తమ తమ కులదేవతల ఆచారాలకు అనుగుణంగా పురాతన సాంప్రాదాయ ఆచార వాయిద్యాలకు తోడుగా ఆధునిక తీన్‌మార్ డప్పులు, డ్రమ్ము, సైడ్‌డ్రమ్ము, కిలార్‌నట్ వాయిద్యాల మధ్య జాతరోత్సవం ఉల్లాసభరితంగా సాగుతుంది.



జాతరలో పోలేరు తల్లి కుంకమబండి

కమిటీ సభ్యులను అడ్డుకోవడం దారుణం



నరసరావుపేట: ఇటీవల తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం సమీపంలోని కరకగూడెం అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌పై వాస్తవాలు తెలుసుకునేందుకు వెళుతున్న తెలంగాణ పౌరహక్కుల సంఘం నాయకులను అడ్డుకోవటాన్ని ప్రజా, కుల సంఘాల నాయకులు ఖండించారు. ఈ మేరకు శనివారం ఎన్‌జీవో హోంలో వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) రాష్ట్ర నాయకుడు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజాస్వామిక పరిపాలన కొనసాగిస్తామని అధికారం చేపట్టిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తాముచేసిన వాగ్దానాలు బూటకమని ఇటీవల జరుగుతున్న ఎన్‌కౌంటర్ల ద్వారా తేట తెల్లమవుతుందన్నారు. పీడీయం రాష్ట్ర నాయకులు నల్లపాటి రామారావు, ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి. కోటనాయక్, పౌర హక్కుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శిఖినం చిన్న, బీసీ, గిరిజన, రజక సంఘాల నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు, శ్రీను నాయక్, సురభి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

17న విశ్వకర్మ విశ్వశాంతి వేడుకలు

శావల్యాపురం: మండలంలోని పోట్లూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీగాయత్రి అమ్మవారి దేవాలయ ప్రాంగణంలో ఈ నెల 17న శ్రీ విరాట్ విశ్వకర్మ విశ్వశాంతి యజ్ఞ మహోత్సవాలు ఘనంగా జరపుతున్నట్లు మండల విశ్వబ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం అధ్యక్షులు పులుకూరి సురేష్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేదపండితులు బ్రహ్మశ్రీ సొలస శివయ్య శాస్త్రి, బ్రహ్మశ్రీ ఉమ్మడిసింగ్ కాళేశ్వరాచారి శాస్త్రిలు సారథ్యంలో దంపతులచే విశ్వకర్మ వేడుకలు ఘనంగా జరుగుతాయన్నారు. భక్తులందరు పాల్గొని స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించాలన్నారు. ఆయనతో పాటు మండల విశ్వబ్రాహ్మణ సంఘం నేతలు కుమ్మరిపల్లి బ్రహ్మం, పులుకూరి శ్రీనివాసరావు, కొండ్రముట్ల రుద్రమాచారి, రావినూతల వెంకటేశ్వర్లు, పులుకూరి వెంకట కోటేశ్వరరావులు పాల్గొన్నారు.

విమోచన ప్రార్థన మందిరంలో చోరీ

శావల్యాపురం: మండలంలోని బొందిలిపాలెం గ్రామంలో విమోచన ప్రార్థన మందిరంలో శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తలుపు గడి పగలకొట్టి చోరీకు పాల్పడినట్లు విమోచన ప్రార్థన మందిరం మతబోధకులు సీహెచ్.యేజేస్కేలు తెలిపారు.

కానుకల హుండీ, యాంప్లిఫ్లేర్ చోరీ జరిగిందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

శ్రేష్టమైన విద్య యోగ



నరసరావుపేట ఈస్ట్: యోగ విద్య శ్రేష్టమైనదని శ్రీవేంకటేశ్వర యోగ సేవా కేంద్రం వ్యవస్థాపకులు ఎ.వెంకటేశ్వర గురూజీ తెలిపారు. యోగ సేవా కేంద్రం నరసరావుపేట శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 177వ ఉచిత యోగ శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా శనివారం నిర్వహించిన ఆనందోత్సవంలో పాల్గొన్న అభ్యాసకులకు వేంకటేశ్వర గురూజీ ఆడియో సందేశం అందించారు. శారీరకంగా మానసికంగా ఎదురయ్యే సమస్యలను యోగా ద్వారా తేలికగా పరిష్కరించుకోవచ్చని వివరించారు. భౌతిక, మనస్సు, ఆత్మ మూడింటినీ చక్కబెట్టుకుంటేనే జీవితం పరిపూర్ణమవుతుందని స్పష్టం చేశారు. శిక్షణకు హాజరైన అభ్యాసకులకు ప్రాంతీయశాఖ నిర్వాహకుడు కూనిశెట్టి వెంకట జనార్దన్ గురూజీ జ్ఞాపికలను అందచేశారు.

క్రీడా పోటీలు ప్రారంభం



క్రీడలను ప్రారంభిస్తున్న డాక్టర్ ఉన్నం నాగమల్లికార్జునరావు

పిడుగురాళ్ల: గ్రామీణ స్థాయిలో క్రీడాకారులను వెలికితీసేందుకు క్రీడా పోటీలు దోహద పడతాయని డాక్టర్ ఉన్నం నాగమల్లి కార్జునరావు అన్నారు. పిడుగురాళ్ల మన్నెం పుల్లారెడ్డి జెడ్పీ ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడా పోటీలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజుల పాటు ఈ పోటీలు నియోజకవర్గ స్థాయిలో నిర్వహిస్తున్నామని తెలిపారు. వాలిబాల్‌లో పిడుగురాళ్ల టీమ్‌పై కారంపూడి జట్టు విజేతగా నిలిచిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పి. ప్రేమ్‌కుమార్, ప్రదాన కార్యదర్శి విజయసారథి, జిల్లా కార్యదర్శులు నాగేశ్వరరావు, జేవీడి నాయక్ ఉన్నారు.

పూజలు, అన్న సంతర్పణలు



సాయిబాబా గుడి వద్ద మండపంలో మహిళల పూజలు



పూజా కార్యక్రమంలో భక్తులు

మాచర్ల: వినాయక చవితి ఉత్సవాలు 8వ రోజు శనివారం ఉత్సాహంగా జరిగాయి. పట్టణంలోని ఓక్ బ్రిడ్జ్ స్కూల్‌లో 500 మందికి పైగా అన్నదానం చేశారు. 13వ వార్డులో 1000 మందికి వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. పత్తి ఫ్యాక్టరీ, సాయిబాబా దేవాలయంలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం వద్ద మహిళా భక్తులు పూజలు చేశారు. 27వ వార్డులో పోలిశెట్టి పిచ్చయ్య బజార్‌లో వినాయకుని విగ్రహం వద్ద భారీగా పూజలు చేశారు.

కొట్టారు.. వదిలేశారు



చెట్టు కొమ్మలు నరికి రోడ్డుకు అడ్డంగా వేసిన వైనం

పిడుగురాళ్ల: విద్యుత్ స్తంభాలకు, వైర్లకు అడ్డం వచ్చిన చెట్ల కొమ్మలను విద్యుత్ శాఖ సిబ్బంది శనివారం తొలగించారు. ఆ చెట్ల కొమ్మలు రోడ్డుకు అడ్డంగా పడయేడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. చెట్లపై కొట్టేసిన కొమ్ములు ఉంచడంతో అవి పడి ఓ స్కూల్ విద్యార్థినికి గాయాలు అయ్యాయి. పిడుగురాళ్ల పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డు, సెయింట్ ఆన్స్ స్కూల్ వెనుక ప్రాంతంలో ఈ పరిస్థితి నెలకొంది. విద్యుత్ శాఖ ఏఈ ఎ.శివ నాగిరెడ్డి స్పందిస్తూ.. విద్యుత్ తీగలకు అడ్డమొచ్చిన చెట్ల కొమ్మలను తొలగించడం తమ బాధ్యతని, వ్యర్థాలను తొలగించాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులదేనని తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు స్వీకరణ



శాస్త్రికి అవార్డు అందజేస్తున్న దేవానందరెడ్డి

మాచర్ల: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం శనివారం విజయవాడలోని వైవీ రావు సిద్ధార్థ కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆడిటోరియంలో శనివారం జరిగింది. ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల సెప్టెంబర్ 5న నిర్వాహించాల్సి ఉండగా భారీ వర్షాల నేపథ్యంలో వాయిదా వేశారు. అవార్డుకు మాచర్లకు చెందిన కిడ్స్ పాఠశాల హెచ్ఎం జేవీఎస్ రామకృష్ణ శాస్త్రి డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్ దేవానంద్‌రెడ్డి అవార్డు అందించారు. ఆంధ్రప్రదేశ్ ఎంఈడీ పాస్డ్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్ ఆధ్వర్యంలో జరిగింది. ప్రైవేటు విద్యా సంస్థల అసోసియేషన్ అధ్యక్షుడు కేవీ రమణ, జెనిత్ శ్రీనివాస్, శ్రీహర్ష వెంకటరెడ్డి, కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ప్రిన్సిపల్ హనుమంతరావు, డైరెక్టర్ శివ, ఆక్స్‌ఫర్డ్ స్కూల్ హెచ్ఎం సురేష్ ఉపాధ్యాయుడిని అభినందించారు.

ఎక్సలెన్స్ అవార్డు స్వీకరణ



అవార్డు స్వీకరిస్తున్న ప్రిన్సిపల్ వేణుగోపాలరావు

కారెంపూడి: స్థానిక ఏపీటీ డబ్ల్యూఆర్ (బాలుర)పాఠశాల ప్రిన్సిపల్ పి.వేణుగోపాలరావు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ నేషనల్ ఎక్సలెన్స్ అవార్డును స్వీకరించారు. తిరుపతిలో శనివారం యువతేజం ట్రస్ట్ అవార్డు ప్రదానం చేసిందని, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గ్రాండ్‌సన్ డాక్టర్ సుబ్రమణ్యం శర్మ కూడా కార్యక్రమానికి విచ్చేశారని పేర్కొన్నారు. గురుపూజా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్ర ప్రదేశ్ నుంచి ఎంపికైన వారిలో తాను ఉన్నానని, జాతీయ స్థాయిలో 175 మందికి ఈ అవార్డు ప్రదానం చేశారని తెలిపారు.

30న మహాజన సభ

మాచవరం: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్ ఆధ్వర్యంలో ఈ నెల 30న మహాజన సభ నిర్వహిస్తున్నట్లు అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జి కడపా శ్రీనివాసరావు శనివారం తెలిపారు. సభ్యుల సభ్యత్వ నమోదు కంప్యూటీకరణలో భాగంగా సభ్యత్వం కలిగి, లావాదేవీలు జరపని సభ్యుల వివరాలు ఆన్‌లైన్ చేసేందుకు సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. అందులో భాగంగా సభ్యులు ఆధార్, పాన్, పట్టాదారు పాస్ పుస్తకం జెరాక్స్‌లు, రెండు పాస్ ఫొటోలు ఈ నెల 29 లోపు కార్యాలయంలో అందించాల్సి ఉందన్నారు. గడవులోపు వివరాలు నమోదు చేసుకోని వారిని ఇన్‌యాక్టివ్ మెంబర్లుగా పరిగణించి, సభ్యత్వ రుసుం సస్పెన్స్ ఖాతాలో ఉంచడం జరుగుతుందన్నారు. కావున సభ్యులు తప్పని సరిగా ఈకేవైసీ చేయించుకోవాలని తెలియజేశారు. సంఘ సభ్యులు ఎవరైనా చనిపోతే మరణ ధ్రువీకరణ,, కుటుంబ సభ్యులు ధ్రువీకరణ పత్రాలు అందిస్తే వారి కుటుంబ సభ్యులకు సభ్యత్వం నమోదు చేయడం జరుగుతుందని తెలియజేశారు.

ఘనంగా పౌష్టికాహార మాసోత్సవాలు



వినుకొండ(నూజెండ్ల): ఐసీడీఎస్ వినుకొండ ప్రాజెక్టు సీడీపీవో ఎం. అనురాధ ఆదేశాల మేరకు వినుకొండ మండలంలోని నరగాయపాలెం సెక్టార్ పరిధిలోని ఉప్పరపాలెం గ్రామంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఈసీసీఈ డే సెలబ్రేషన్స్ జరిపారు. అంగన్‌వాడీ సెంటర్లలో జరిగే ప్రీ స్కూల్ కార్యక్రమాల గురించి తల్లులకు వివరించారు. బాలింతలకు తల్లిపాలు బిడ్డకు పట్టే విధానం గురించి వివరించడం జరిగింది. తర్వాత పౌష్టికాహార మాసోత్సవాల కార్యక్రమం జరిపి తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు కలిగిన ఆహార పదార్థాల గురించి వివరించారు. పౌష్టికాహార మాసోత్సవాల ర్యాలీ నిర్వహించి తల్లులతో గ్రామ కూడలి వద్ద మానవహారం నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎం.నాగరాజుకుమారి, అంగన్‌వాడీ టీచర్స్ టి.సుజాత, కె.ఆరోగ్యం, ఏఎన్ఎం అంజలి, ఎం. సామ్రాజ్యం, ఆశలు, ఎం. శ్రీదేవి, వై.శైలజ, డి.లీలావతి పాల్గొన్నారు.